పల్లె దవాఖానాల్లో సిబ్బంది కొరత

- ఆర్నెళ్లుగా సెలవులో వైద్యురాలు
- ఏఎన్‌ఎంతో వైద్యసేవలు
- రోగులకు ఇబ్బందులు

రాయికల్: పల్లె దవాఖానాలో రోగులకు వైద్యసేవలు అందించేందుకు వైద్యురాలు లేక వైద్య సేవలు అందడం లేదు. మండలంలోని అల్లీపూర్ పల్లె దవాఖానాలో ఆరునెలలుగా డాక్టర్ దీప్తి సెలవులో ఉండటంతో వైద్య సేవలకు ఆటంకం కలుగుతోంది. వైద్యాధికారులు మరో డాక్టర్‌ను నియమించకపోవడంతో దవాఖానాలో రెండో ఏఎన్‌ఎం వైద్య సేవలు అందిస్తున్నారు. రాయికల్ మండలం అల్లీపూర్‌లో పల్లె దవాఖానాను ప్రభుత్వం ఏర్పాటు చేయగా, ఈ దవాఖానా కింద అల్లీపూర్, కిష్టంపేట, కుర్మపల్లి గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందుతాయి. ఈ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించేందుకు గాను వైద్యురాలు, ఇద్దరు ఏఎన్‌ఎంలను ప్రభుత్వం నియమించింది. ఆరునెలలుగా డాక్టర్ దీప్తి సెలవులో ఉండటంతో ఉన్న ఇద్దరు ఏఎన్‌ఎంల్లో పుష్ప అనే మొదటి ఏఎన్‌ఎం మేడిపల్లికి ప్రమోషన్‌పై బదిలీ వెళ్లింది. దీంతో రెండో ఏఎన్‌ఎం జ్యోతి మాత్రమే విధులు నిర్వహిస్తూ రోగులకు వైద్యసేవలు అందిస్తోంది.

వైద్యురాలు లేక ఇబ్బందులు..

అల్లీపూర్‌లోని పల్లె దవాఖానాకు అల్లీపూర్, కిష్టంపేట, కుర్మపల్లి గ్రామాలు ఉండగా, 7635 జనాభాకు గాను బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు, మందుల పంపిణీ, చిన్నారులకు వ్యాక్సిన్ వంటి కార్యక్రమాలను ఈ పల్లె దవాఖానా ద్వారా వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. గతంలో ఉన్న వైద్యురాలు ఈ మూడు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తోంది. వైద్యురాలు సెలవులో ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, తమ గ్రామంలోని పల్లె దవాఖానాకు డాక్టర్‌ను నియమించాలని ఎన్నోసార్లు వైద్యుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి స్పందించి యుద్ధప్రాతిపదికన పల్లె దవాఖానాకు డాక్టర్‌ను నియమించాలని కోరుతున్నారు.



అల్లీపూర్‌లో వైద్యసేవలు అందిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎం జ్యోతి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా



మా గ్రామంలోని పల్లె దవాఖానాలో పనిచేస్తున్న డాక్టర్ దీప్తి సెలవులో వెళ్లి ఆరునెలలు అవుతోంది. డాక్టర్‌ను నియమించాలని ఎన్నోసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా మా సమస్యను ఎవరూ పరిష్కరించడం లేదు. దీంతో వైద్యసేవల కోసం రాయికల్, జగిత్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– అత్తినేని గంగారెడ్డి, సర్పంచ్, అల్లీపూర్

డాక్టర్‌ను నియమిస్తాం



అల్లీపూర్ పల్లె దవాఖానాలో వైద్యురాలిని నియమిస్తాం.. వైద్యురాలు సెలవులో ఉన్న విషయం ఇటీవలే మా దృష్టికి వచ్చింది. ఇద్దరు ఏఎన్‌ఎంలు విధులు నిర్వహించాల్సి ఉండగా, ఒక ఏఎన్‌ఎం ప్రమోషన్‌తో బదిలీ అయింది. వెంటనే దవాఖానాలో డాక్టర్‌ను నియమించి వైద్య సేవలందిస్తాం

– శ్రీధర్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

ఉపాధిహామీ పనులు పరిశీలన



కూలీల హాజరు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్ గురువారం ఉపాధిహామీ పనులను ఎంపీడీవో వెంకటేశం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీల హాజరు పట్టిక మస్టర్‌ను పరిశీలించారు. అనంతరం నర్సరీ సందర్శించారు. నర్సరీల్లో నాటేందుకు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. సర్వాపూర్‌లోని నర్సరీ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, రిజిస్టర్లు తనిఖీ చేశారు.

నర్సరీల్లో విత్తనాలు నాటాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభు

ఇబ్రహీంపట్నం: నర్సరీల్లో విత్తనాలు నాటాలని ఎంపీడీవో ప్రభు సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని కొజన్ కొత్తూర్, కేశాపూర్ నర్సరీలు పరిశీలించారు. నర్సరీల్లో కవర్లలో మట్టిని నింపి ఉంచారని విత్తనాలు నాటకుండా మట్టిని నింపి ఉంచితే ఆ మట్టి గడ్డకట్టి ఉంటుంది కాబట్టి అలా మట్టిని నింపి ఉంచకూడదని వెంటనే విత్తనాలు లేదా నారు తీసుకవచ్చి నాటాలని సూచించారు. మొలకెత్తిన మొక్కలకు 2 పూటల నీళ్లు పట్టాలని, నర్సరీల్లో పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మల్యాల: కుష్టువ్యాధిని సకాలంలో గుర్తించి, చికిత్స ప్రారంభిస్తే వ్యాధిని నివారించవచ్చని డీపీఎంవో దేవీసింగ్ అన్నారు. కుష్టువ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని నూకపల్లి మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే కుష్టువ్యాధి లక్షణమని గుర్తించాలని వివరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరితాదేవి, డీపీఎంవో దేవీసింగ్, రమేశ్, వేణు, ఏఎన్‌ఎం శకుంతల, కవిత పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందిస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్

ధర్మపురి: రైతులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రూ. 24 లక్షల విలువ గల చెక్కులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం ద్వారా తక్కువ వడ్డీతో అందిస్తున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి తిరిగి రుణాలను పొందాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్లాగౌడ్, కుమ్మరి రవి, సీఈవో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



జగిత్యాల: స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ – 14 జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు జగిత్యాల జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి గౌతమ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా డైరెక్టర్ హరిచరణ్‌రావు మాట్లాడుతూ వచ్చేనెల 5 నుంచి 8వ తేదీ వరకు జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, మానికరావు, రజితరావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ప్రమాదబీమా

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రమాదబీమా ఎంతో లబ్ధి చేకూరుస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామానికి చెందిన ఏనుగు ఎల్లారెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందగా, గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్‌ఎస్ సభ్యత్వం కలిగి ప్రమాదవశాత్తు మరణిస్తే బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని, రాష్ట్రంలో 60 లక్షల మంది కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం తీసుకున్నారన్నారు. కార్యకర్తల బీమా కోసం పార్టీ రూ.11 కోట్లు చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్ముల రమణ, రమేశ్, మహిపాల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, అశోక్, గంగారెడ్డి, భూమేశ్, మహేశ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా ఉంటా

జగిత్యాల: పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెన్షనర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ పెన్షనర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పీఆర్సీలో 43 శాతం పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. పెన్షనర్లకు ప్రతినెల ప్రభుత్వం ఇచ్చే గౌరవ భృతిపై ఆదాయ పన్ను విధించడంపై కేంద్ర ప్రభుత్వం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, బొల్లం విజయ్, విశ్వనాథ్, హన్మంతరెడ్డి, యాకూబ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

రాయికల్: పట్టణానికి చెందిన జిల్లా మనోహర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, దుబాయ్‌లో ఆయనతో పాటు పనిచేస్తున్న స్నేహితులంతా కలిసి గురువారం స్నేహితుడి కుటుంబానికి రూ.35,600 సేకరించి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దుబాయ్ స్నేహితులు భద్రి ధర్మేందర్, కిరణ్‌కుమార్, రాము, సత్తయ్య పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి..

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామానికి చెందిన ఆరెపెల్లి అనిల్ అనే మెకానిక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి మెకానిక్‌ల సంఘం ఆధ్వర్యంలో గురువారం రూ. 10 వేలు భార్య, పిల్లలకు మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు బూస రాజేశ్వర్ అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హరీశ్, కార్యదర్శి సంజీవ్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం ఇవ్వాలి

మల్లాపూర్: 61 ఏళ్లు దాటిన గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ)ల వారసులకు నియామక పత్రాలు అందజేయాలని వీఆర్‌ఏలు తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 3,797 మంది వీఆర్‌ఏ వారసులకు జట్టి జూనియర్, రికార్డు అసిస్టెంట్, అటెండర్ క్యాడర్ పోస్టుల్లో నియమిస్తామని ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటివరకు నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మా వారసులకు ఉత్తర్వులు అందించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



తహసీసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

అయోధ్య యాత్రికులకు సన్మానం

రాయికల్: పట్టణంలోని గుండేటి మాదవ్, నల్లూరి వరుణ్ సైకిల్‌పై అయోధ్యకు వెళ్లి ఇటీవల తిరిగి రాగా, గురువారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో వీరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, నాయకులు ఎద్దండి దివాకర్‌రెడ్డి, గంగాధర్, బత్తిని భూమయ్య పాల్గొన్నారు.

సర్పంచులకు ఆత్మీయ సత్కారం

రాయికల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని 32 గ్రామాల సర్పంచులను అధికారులు సన్మానించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఎంపీడీవో సంతోష్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి సన్మానం

బుగ్గారం: సర్పంచుల పదవీకాలం ముగియడంతో గురువారం బుగ్గారం మండల మాజీ సర్పంచ్ మూల సుమలత దంపతులు స్థానిక పంచాయతీ సిబ్బందితో పాటూ తోటి పాలకవర్గ సభ్యులను సన్మానించారు. మండల కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్ సైతం పాలకమండలి సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మూల శ్రీనివాస్‌గౌడ్,నగునూరి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

పెగడపల్లి:ఈ నెల 16 నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం ఎంఈవో శ్రీనివాస్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

కోరుట్ల: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో సమితి సెక్రటరీ చెట్‌పల్లి శంకర్, కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్, ప్రధానాచార్యుడు గోపు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ. 65 లక్షలు మంజూరు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలకు ఉపాధిహామీ పథకం నిధులు రూ.65 లక్షలు మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సిరికొండ, కథలాపూర్, దూలూర్, పోతారం, తాండ్ర్యాల, చింతకుంట, దుంపేట, తక్కళ్లపెల్లి, భూషణరావుపేట, గంభీర్‌పూర్, కలిగోట గ్రామాలకు ఈ నిధులు కేటాయించామని పేర్కొన్నారు.

యజ్ఞశాలకు భూమిపూజ

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో యజ్ఞశాల నిర్మాణానికి ఆలయకమిటీ సభ్యులు గురువారం భూమిపూజ చేశారు. పెగడపల్లి మాజీ సర్పంచి జాల తిరుపతిరెడ్డి–గంగ దంపతుల స్వంత ఖర్చులు వెచ్చించి యజ్ఞశాల నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పోచయ్య, సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో గ్రామాల అభివృద్ధి

జగిత్యాలరూరల్: ఉపాధి నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. జగిత్యాలరూరల్ మండలం తిమ్మాపూర్ సర్పంచ్ మేరుగు రమ్య సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వం తెచ్చిన ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే నిధులతో కూలీలకు పని, గ్రామాల్లో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు చేసి సర్పంచులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం బకాయి ఉన్న ప్రతి పైసా చెల్లిస్తుందన్నారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ శీలం సురేందర్, నాయకులు గాజంగి నందయ్య, ధర్మయ్య, మునీందర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'జువ్వాడికి కార్పొరేషన్ పదవి ఇవ్వాలి'

కోరుట్ల: నియోజకవర్గ జువ్వాడి నర్సింగరావుకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి ఇవ్వాలని పట్టణ కాంగ్రెస్ నాయకుడు హమీద్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ, దివంగత జువ్వాడి రత్నాకర్‌రావు వారసత్వంతో ఏళ్ల తరబడి జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించారన్నారు. నియోజకవర్గంలో ప్రజాసేవలో ఉండి అభివృద్ధి పనుల నిర్వాహణకు పాటుపడుతున్న నర్సింగరావుకు కార్పొరేషన్ పదవి ఇయ్యాలని కోరారు.

ఆదమరిస్తే అంతే సంగతి..



ప్రమాదకరంగా తాండ్ర్యాల–గంభీర్‌పూర్ మధ్య వంతెన

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల– గంభీర్‌పూర్ గ్రామాల మధ్య వాగుపై వంతెన ఓ వైపు కూలి ప్రమాదకరంగా మారింది. రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించి వంతెన ఒకవైపు కూలింది. వాహనదారులు రాత్రివేళ గమనించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి వంతెనకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

'వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి'

కోరుట్ల: కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుపై వ్యక్తిగత విమర్శలు మాని పట్టణ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కౌన్సిలర్లు అన్నారు. పట్టణంలో గురువారం మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే సంజయ్ గత పదేళ్లుగా సొంత పనులకు వాడుకుని మున్సిపల్ నుంచి జీతాలు ఇప్పించారని ఆరోపించటం సరికాదన్నారు. విద్యాసాగర్ రావు ప్రభుత్వ ప్రతినిధిగా ప్రజల పనుల కోసమే మున్సిపల్ ఉద్యోగులను ఉపయోగించుకున్నారని వ్యక్తిగత పనులకు ఏనాడూ ఉపయోగించుకోలేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, గందం గంగాధర్, పేర్ల సత్యం, జిందం లక్ష్మీనారాయణ, ముజఫర్ అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

కార్యకర్తలకు అండగా ఉంటాం

మేడిపల్లి: కార్యకర్తలకు అందుబాటులో ఉంటామని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. మేడిపల్లి మండల కేంద్రంతో పాటు కట్లకుంట, తొంబరావుపేట, గుండ్లపల్లి, పోరుమల్ల గ్రామాల్లో గురువారం పర్యటించి సమావేశాల్లో మాట్లాడారు. కార్యకర్తలకు చేదోడు వాదోడుగా ఉంటారని ఏం అవసరం ఉన్న తనని సంప్రదించాలన్నారు. 7న వేములవాడలో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంకం సాగర్, చెన్నమనేని అజిత్ రావు, అంగడి ఆనంద్, దవనపల్లి అభిలాష్, సంపత్ కుమార్, గడ్డం నారాయణరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, నవీన్ రెడ్డి, భూమ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాతుతున్న చల్మెడ

బాధితుడికి పరామర్శ

కథలాపూర్: మండలం చింతకుంట గ్రామానికి చెందిన కర్నె శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో గురువారం ఆయనను పరామర్శించారు.

రైతాంగ సమస్యలపై నిరంతర పోరాటం

మల్లాపూర్: రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారతీయ కిసాన్‌సంఘ్ నిరంతరం పోరాటం చేస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు కొల్లెం మహిపాల్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలో గురువారం సభ్యత్వ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గాలం కష్టించి రైతులు పండించే పంటలు అటవీ జంతువుల దాడులతో తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని త్వరగా అందించాలన్నారు. అటవీ జంతువుల నుంచి పంటకు రక్షణ కల్పించే చైన్ లింక్ ఫెన్సింగ్, ఇతర ఉపయోగకరమైన వస్తువులను 80శాతం సబ్సిడిపై అందించాలన్నారు. యాసంగి పంటల కొనుగోలు కేంద్రాల క్యాలెండర్‌ను నిర్ణయించాలని, రైతాంగానికి రావాల్సిన బీమా బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో భారతీయ కిసాన్‌సంఘ్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

నెరవేరిన పెగడపల్లి మండలవాసుల కల

పెగడపల్లి:ఎన్నో ఏళ్ల నుంచి పెగడపల్లి మండలవాసులు వేచి చూస్తున్న బీటీ రోడ్ల కళ ఎట్టకేలకు నెరవేరింది. ఓ వైపు రామడుగు మండలం మరోవైపు గంగాధర మండల నుంచి, ఇంకో వైపు గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ వరకు సుమారు 50 కోట్లతో ఇటీవల రెండు వరుసల రహదారులు పూర్తయ్యాయి. పెగడపల్లి నుంచి మల్యాల వెళ్లే రోడ్డుకు కూడా రూ. 20 కోట్లు కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి బీటీ కూడా వేస్తున్నారు. దీంతో నాలుగు రోడ్లకు ఎంతో ప్రాధాన్యత పెరిగింది. కరీంనగర్, జగిత్యాల రహదారికి కలిసే పెసులుబాటు ఉండటంతో వాహనదారులు ఎక్కువగా ఈ మార్గాల ద్వారానే ప్రయాణం చేస్తుంటారు. ఏది ఏమైనా మండల కేంద్రం నుంచి నలుదిక్కున ఉన్న రోడ్లన్నీ రెండు వరుసలతో తారు రోడ్లు వేయడంతో మండల ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మూల మలుపులు ఉన్న ప్రాంతంలో ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



పెగడపల్లి– మల్యాల డబుల్ రోడ్డు పనులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని సబ్‌స్టేషన్ పరిధిలోని మెట్‌పల్లి మండలం కోనరావుపేట, పెద్దాపూర్, రామారావుపల్లె గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకువిద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ భూక్యా శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ శివారు జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇండ్ల లత (45) మృతిచెందిన విషయం తెల్సిందే. సంఘటనపై ఆమె సోదరుడు కన్నం మురళీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

నిరుపయోగంగా మహిళా సమాఖ్య భవనం



మల్యాల: మండల కేంద్రంలో నిర్మించిన మండల మహిళా సమాఖ్య భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. గతంలో ఇదే భవనంలో మహిళా సంఘాల సమావేశాలు నిర్వహిస్తుండేవారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న మహిళా సమాఖ్య భవనం నిరుపయోగంగా మారడంతో, భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి, భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.